WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా
మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో
పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/
జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది.
అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు..
ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhi telangana

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి : 1
సంచిక : 66
సోమవారం
11.11. 2024



బీసీ డిక్లరేషన్ హామీ
## ఏమైంది?

- కులగణనను స్వాగతిస్తున్నాం..
- బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించండి
- హనుమకొండలో కేటీఆర్

03

హైదరాబాద్
## వస్తున్నా..

- దమ్ముంటే ఆపండి
- మీకు శివతాండం చూపిస్తా!
- అఘోరీ సంచనల వీడియో
- సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్


03



జూబ్లీహిల్స్‌లో
## భారీ పేలుడు

- పలువురికి తీవ్ర గాయాలు
- హెూటల్‌లోని రిఫ్రిజిరేటర్‌కంప్రెషర్ పేలడంతో ప్రమాదం
- పక్కనున్న బస్తీలోని ఆరు ఇండ్లు ధ్వంసం

03



## గ్రూప్-3 హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

03






పాలమూరు జోలికి వస్తే
# ఊరుకునేది లేదు

### ప్రాజెక్టులు పూర్తి చేసుకోకపోతే చరిత్ర క్షమించదు

### అభివృద్ధికి అడ్డుపడొద్దు.. చరిత్రహీనులుగా మిగులొద్దు



- పాలమూరు కృతజ్ఞతను కేసీఆర్ మర్చిపోవద్దు
- నాపై కోపముంటే, నను సాధించండి
- కుట్రలు చేస్తే ప్రజల చమటల్లో కొట్టుకపోతరు
- కురుమూర్తి, మన్యంకొండను అభివృద్ధి చేస్తాం
- మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, నవంబర్10:** పాలమూరును అభివృద్ధి చేద్దామని, వలసలను ఆపాలని ప్రయత్నిస్తుంటే.. ఆరోపణలతో చిల్లర రాజకీయాలు చేయాలని చూస్తున్నారని ప్రతిపక్షాలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పాలమూరుకు అన్యాయం జరిగిందని.. ఈ ప్రాంతానికి చెందిన తాను తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యానని.. ఈ జిల్లాకు నిధులు కేటాయించి, ప్రాజెక్టులు పూర్తి చేసుకోకపోతే చరిత్ర తనను క్షమించదని అన్నారు. పాలమూరు అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరారు. తనపై రాజకీయంగా కోపం ఉంటే ఇంకో రకంగా రాజకీయ కక్ష సాధించుకోండని అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్

మిగతా 2 లో

## జనాభా లెక్కకోసమే!



- వివరాలు రహస్యంగానే ఉంచుతాం
- సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌భరోసా

02



పరిశ్రమలకు ఎంట్రీ పాయింట్
## హైదరాబాద్

- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- కౌలాలంపూర్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

02

బాలికపై బావ
## లైంగికదాడి

- నల్లగొండ జిల్లాలో దారుణం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

**దేవరకొండ, నవంబర్10:** నల్గొండ జిల్లాలో దారుణం జరిగింది. బాలికపై బావ లైంగికదాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో చందంపేట మండలంలోని చిత్రీయాల గ్రామానికి చెందిన బాలికపై వరుసకు బావ అయిన ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడినట్టు చందంపేట ఎస్సై సతీష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం..



ప్రజలను మోసం చేస్తున్న
## మజ్లిస్‌నేతలు

- ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల పక్షపాతం
- నిధుల కొరతతో బస్తీల్లో జనం అవస్థలు
- నిర్లక్ష్యానికి గురైన బస్తీలను అభివృద్ధి చేస్తాం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, నవంబర్ 10 :** ఏండ్లుగా నాంపల్లి నియోజకవర్గంలో మజ్లిస్ నేతలు ప్రజాప్రతినిధులుగా ఉండి ప్రజలను మోసం చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. అనేక ఏండ్లుగా ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేలుగా, కార్పొరేటర్లుగా, మజ్లీస్ పార్టీ నేతృత్వం వహిస్తున్నదని, హిందూ బెల్ట్ ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కూడా ప్రజలకు అందకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కిషన్ రెడ్డి

మిగతా 2 లో



## మూసీ నదిలో తాగునీరు పారాలి

- ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు.. ఇండ్ల కూల్చివేతను సహించం
- దౌర్జన్యం చేస్తే ప్రజలు బండకేసి కొడుతరు
- కేసీఆర్ ను కొడితే ఏమైపోరారో చూశారు
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, నవంబర్10:** మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కానీ మూసీలో పారాల్సింది మురికి నీరు కాదు, తాగే నీరు పారాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని భావన కాలనీలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనను తాము ఎప్పుడూ వ్యతిరేకించలేదని అన్నారు. ఇల్లు కూలగొట్టి పెద్దలకు, కార్పొరేట్ కంపెనీలకు ఆ భూములు కట్టబెట్టే ఆలోచనను మేము

మిగతా 2 లో

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్



## ప్రజలను మోసం చేస్తున్న మజ్లిస్‌నేతలు

- ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల పక్షపాతం
- నిధుల కొరతతో బస్తీల్లో జనం అవస్థలు
- నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, నవంబర్10 :** ఏండ్లుగా నాంపల్లి నియోజకవర్గంలో మజ్లిస్ నేతలు ప్రజాప్రతినిధులుగా ఉండి ప్రజలను మోసం చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. అనేక ఏండ్లుగా ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేలుగా, కార్పొరేటర్లుగా, మజ్లీస్ పార్టీ నేతృత్వం వహిస్తున్నదని, హిందూ బెల్ట్ ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కూడా ప్రజలకు అందకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని మల్లేపల్లి డివిజన్‌లోని డీ క్లాసులో కమ్యూనిటీ హాల్, ఆసిఫ్ నగర్ డివిజన్ లోని దయాబాగ్ జీ ప్లస్ వన్ కమ్యూనిటీ హాల్ తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను సుమారు 78 లక్షల వ్యయంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మజిలీస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు పక్షపాతంతో వ్యవహరిస్తూ ఇక్కడి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని కేంద్ర మంత్రి విమర్శించారు. పార్లమెంటు సభ్యుడిగా బాధ్యతగా నాంపల్లి నియోజకవర్గ ప్రజలకు మేలు చేసేలా అనేక పనులు చేస్తున్నామని తెలిపారు. నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌సహాయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అందుకోసం బస్తీ నాయకులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు నిధుల కొరత వేధిస్తున్నదని, కనీసం వీధిలైట్లు హ్యాండిల్ చేసే సిబ్బందికి కూడా జీతాలు ఇవ్వడం లేదని, దీంతో సమ్మెకు దిగారని తెలిపారు. నగరంలోని కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదన్నారు. అంబర్‌పేట్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, గోషామహల్ వంటి ప్రాంతాల్లోని బస్తీల్లో నిధుల కొరతతో ప్రజలకు అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లకు నిధుల కొరతతో అరకొర సౌకర్యాలతో పాఠశాలలు నడుస్తున్నాయని ఆయన విమర్శించారు. నిధులు కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకుడు మాజీ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ 60వ జయంతి సందర్భంగా గుడిమల్కాపూర్ డివిజన్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మిఠాయిలు పంచారు. మెమొంటోలను కూడా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మూసీ నదిలో తాగునీరు పారాలి

మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాని మరిచి ప్రజల మీద దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి విషయాల్లో ప్రజల తరఫున తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలను ఏమన్నా ఫర్వాలేదనుకుంటే పొరపాటని చెబుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కొడితే ఏమైపోయారో చూశారని అన్నారు. వీళ్ళని కొట్టే రోజులు కూడా ఎక్కువ దూరంలో లేదన్నారు. ఇంకా నాలుగు సంవత్సరాలు పాలన చేసే అవకాశం ఉంది, ప్రజల కోసం మంచి చేసే ప్రయత్నం చేయాలని అన్నారు. దేశ సమగ్రత, అభివృద్ధి, ఆత్మగౌరవం ప్రపంచ చిత్రపటం మీద నిలవాలంటే ప్రధాని మోడీకి మరింత బలం చేకూర్చాలన్న సంకల్పం దేశవ్యాప్తంగా చూస్తున్నామని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మనకి పడ్డ ఓట్లలో 50 శాతం సభ్యత్వ నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

### భవిష్యత్‌లో బీజేపీదే అధికారం

రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరుగుతుందని, భవిష్యత్తులో అధికారంలోకి రావడం ఖాయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. వారందరికీ ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాసగౌడ్, నాయకులు తిరుమల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి అడ్డుపడొద్దు

మొదటి పేజీ తరువాయి

మహబూబ్ నగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. కురుమూర్తి స్వామిని దర్శించుకొని.. కొండకు వెళ్లే ఘాట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహా, జిల్లా కాంగ్రెస్ నేతలు కురుమూర్తి వెంకన్న స్వామి పూజల్లో పాల్గొన్నారు. పదేళ్లు ఏ అభివృద్ధి చేయకపోవడంతో ఇంకా వలసలు కొనసాగుతున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా వలసలకు కేరాఫ్ అడ్రస్ అని.. వలసలు ఆపాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లాని ఆనుకొని కృష్ణానది వెళ్తున్నా.. మహబూబ్ నగర్ లో కరువు తాండవిస్తోందన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆయన అన్నారు. కురుమూర్తి, మన్నెంకొండ జాతరలను ఇంకా ఘనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. గతంలో మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు కేసీఆర్ కు ఓట్లు వేసి.. పార్లమెంట్ కు పంపిన కృతజ్ఞతను కేసీఆర్ మర్చిపోవద్దని ఆయన చెప్పుకొచ్చారు. పాలమూరు జిల్లా అండగా నిలబడితేనే కేసీఆర్ రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. అయినా.. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు మహబూబ్ నగర్ జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సీఎంగా పాలమూరు బిడ్డకు అవకాశం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కురుమూర్తి స్వామి ఆశీర్వాదంతోనే ఆయన ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. కురుమూర్తి దేవాలయానికి రూ.110 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పామూరు జిల్లా ప్రజలకు కురుమూర్తి బ్రహ్మోత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి వెళ్లలేని వాళ్లకు.. పేదల తిరుపతిగా కురుమూర్తి వెంకన్న స్వామి కరుణిస్తాడని భక్తులకు నమ్ముతారని అన్నారు. పాలమూరు జిల్లా ప్రజల చెమటతోనే ఎన్నో ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయని, ఈ జిల్లా ప్రజల ఆశీర్వాదంలోనే పార్లమెంట్ కు వెళ్లానని ఆయన గుర్తు చేసుకున్నారు. కృష్ణమ్మ జలాలతో పాలమూరును సస్యశ్యామలం చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చాడు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులిస్తుంటే.. కొందరు విమర్శలు చేస్తున్నారని అన్నారు సీఎం. ఇంకో రకంగా రాజకీయంగా విమర్శలు చేయండి. కానీ.. అభివృద్ధికి అడ్డ పడొద్దని రేవంత్ రెడ్డి సూచించారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు అడ్డుపడితే ఎవ్వర్ని క్షమించవద్దని సీఎం రేవంత్ రెడ్డి యువతకు సూచించారు. నారాయణ్‌పేట్ – కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేసి త్వరలోనే మక్తల్, నాగర్‌కర్నూల్, కొడంగల్ ప్రాంతాలకు కృష్ణా జలాలను పారిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. "తెలంగాణ వచ్చి పదేళ్లవుతున్నా పాలమూరు నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదు" అని అన్నారు. కురుమూర్తి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయంలో లక్ష్మీదేవి, భూదేవి అమ్మవార్లను దర్శించుకుని ఆశీర్వచనం తీసుకున్నారు. అంతకు ముందు శ్రీ కురుమూర్తి స్వామి ఆలయానికి రూ.110 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఘాట్ రోడ్డు, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. 'పాలమూరు జిల్లా వలసలకు మారుపేరు.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. ప్రజా ప్రభుత్వ భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూడొద్దు'.. అని అన్నారు. వలసలు నిరోధించడానికి జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేసి, పాడి పంటలతో విలసిల్లేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయన్నారు. ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదని చెప్పారు. అడ్డుకోవాలని చూసే వారిని పాలమూరు జిల్లా ప్రజలు క్షమించరని అన్నారు. అలాంటివారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. జిల్లాలో అమర్‌రాజా బ్యాటరీస్ కంపెనీలో 2 వేల మంది స్థానిక నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ అంగీకరించిందన్నారు. ఈ ప్రాంతంలో ఏ కంపెనీలు వచ్చినా ఈ ప్రాంత నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. జిల్లాలో గ్రామ గ్రామానికి, తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత తమదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామన్నారు.


### సస్యశ్యామలం చేస్తాం

పాలమూరు అభివృద్ధికి ఎవరూ ఆటంకం కలిగించినా ప్రజల చమటల్లో కొట్టుకుపోతారని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఇక్కడి యువత మీకు ఎలా గుణపాఠం చెప్పాలో అలా చెబుతారని అన్నారు. తన మీద కోపముంటే, తనను సాధించండి అంతేకానీ పాలమూరు జోలికి వస్తే ఊరు కునేది లేదని హెచ్చరించారు. ఉమ్మడి పాలమూరును కృష్ణా జలాలతో తడుపుతామని హామీ ఇచ్చారు. మక్తల్–నారాయణపేట– కొడంగల్ ప్రాజెక్టును పూర్తిచేసి ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. ప్రసిద్ధిగాంచిన కురుమూర్తి, మన్యంకొండ దేవాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు రోడ్లు వేసి తీరుతామన్నారు. అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి నివేదికను అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు హైదరాబాద్

ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

కౌలాలంపూర్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



**హైదరాబాద్, నవంబర్10:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన సులభతర వాణిజ్య విధానాలతో పరిశ్రమలను స్థాపించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మలేషియా రాష్ట్రం కౌలాలంపూర్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ దశాబ్ది వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన సులభతర వాణిజ్య విధానాలతో పరిశ్రమలను స్థాపించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని అన్నారు. మలేసియాలో జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవ వేడుకలకు ఆయన ఆదివారం హాజరయ్యారు. కౌలాలంపూర్‌లోని అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. స్థానిక తెలంగాణ ఎన్ఆర్ఐలు ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

### హైదరాబాద్ ఎంట్రీ పాయింట్

మలేసియా– భారత్‌ల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. పెట్టుబడులతో వచ్చే వాళ్లందరికీ హైదరాబాద్ ఎంట్రీ పాయింట్‌గా ఆహ్వానం పలుకుతోందని తెలిపారు. వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించేందుకు తాము అన్ని ఏర్పాట్లు కూడా చేస్తున్నామని పేర్కొన్నారు.

### వాళ్లకి ఎప్పటికీ రుణపడి ఉంటాను

మరోవైపు తాను ప్రజాప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తనకు అభినందనలు తెలిపిన వాళ్లకు శ్రీధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. 2 దశాబ్దాల తన రాజకీయ ప్రస్థానంలో పార్టీలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, మల్లిఖార్జున్ ఖర్గేలకు ఎప్పటికీ కూడా రుణపడి ఉంటానన్నారు. ఇప్పటిదాకా నలుగురు సీఎంల వద్ద మంత్రిగా ప్రజలకు సేవలు అందించానని.. వారు తనపట్ల ఎంతో ఆదరాభిమానాలు కనబర్చారని పేర్కొన్నారు.

## కాసిపేటలో పులుల సంచారం



**కాసిపేట, నవంబర్10 :** మంచిర్యాల జిల్లాలో పులుల సంచారం ఆందోళన కలిగిస్తోంది. పులుల సంచారంతో అక్కడి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కాసిపేట మండలం పెద్ద ధర్మారం సమీపంలో పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఆదివారం మామిడిగూడెం పంచాయతీ గోండుగూడకు చెందిన చిత్రు అనే గిరిజన రైతుకు చెందిన ఆవుల మందపై పులి దాడి చేసిన విషయం తెలిసిందే. సురక్షిత ఆవాసం కోసం వెతుకుతూ.. 3 రోజుల క్రితం పెద్దపల్లి కవ్వాల అభయారణ్యంలోకి వెళ్లినట్లు స్థానికులు, అధికారులు పేర్కొంటున్నారు. శనివారం తెల్లవారుజామున పెద్ద ధర్మారం గ్రామానికి అతి సమీపంలోని రహదారిపై పులి అడుగులు కనిపించడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పంటచేన్లలో కాపలా ఉన్న కొందరు పెద్దపులి అరుపులు వినిపించినట్లు చెబుతున్నారు. ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలోకి పెద్దపులి రావడంతో అటవీ శాఖ సిబ్బందిని అధికారులు అప్రమత్తం చేశారు. వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. పులిని గుర్తించేందుకు ట్రాకింగ్ కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పులికి ఎలాంటి హానీ తలపెట్టకుండా ఉండేందుకు స్థానిక అటవీ అధికారులు శివారు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సమీప గ్రామాల ప్రజలు ఒంటరిగా తిరగవద్దని తమ పనులను ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు చేసుకోవాలన్నారు. పశువులు, మేకలు మేపుకోవడానికి అటవీ ప్రాంతం వైపు వెళ్లకూడదని సూచించారు.

## జనాభా లెక్కకోసమే!

- వివరాలు రహస్యంగానే ఉంచుతాం
- సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌భరోసా

**హుస్నాబాద్, నవంబర్10:** తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వేపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక భరోసా ఇచ్చారు. సర్వే వల్ల సంక్షేమ పథకాల్లో కోత ఉండదని చెప్పారు. సర్వేలో వెల్లడించిన వివరాలు మొత్తం గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం హుస్నాబాద్ లో సర్వేను పరిశీలించిన పొన్నం... రాష్ట్ర వ్యాప్తంగా 87 వేల మంది ఎన్యుమరేటర్లతో సర్వే కొనసాగుతోందని చెప్పారు. అన్ని రకాల అసమానతలను తొలగించి, కులాల జనాభా తెలుసుకునేందుకు సర్వే చేస్తున్నాని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. దీనిపై ఈనెల 30 వరకు కార్యక్రమం నిర్వహిస్తోంది. ఒక్కో ఎన్యూమరేటర్ 150 నుంచి 175 ఇళ్ల దాకా కేటాయించారు. కుటుంబ వ్యక్తిగత వివరాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి కుటుంబంలోని సభ్యులందరి సమగ్ర వివరాలను నమోదు చేస్తున్నారు. కాబట్టి ప్రజలంతా సహకరించాలి. కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారం నమొద్దు' అని కోరారు.

### మొత్తం 243 కులాలు..

ఇదిలా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వే కోసం మొత్తం 243 కులాలను గుర్తించింది. వీటన్నింటికీ కోడ్స్‌ను కూడా కేటాయించింది. అధికారులు తమ ప్రశ్నపత్రంలో ఆయా కుటుంబాల కులానికి సంబంధించిన కోడ్ కేటాయించాల్సి ఉంటుంది. ఎస్సీ కేటగిరిలో 59 కులాలు ఉండగా, ఎస్టీ కేటగిరిలో 32 కులాలు ఉన్నాయి. బీసీ కేటగిరిలో ఏ,బీ,సీ,డీ, ఈబీసీ కలిపి మొత్తం 134 కులాలు ఉన్నాయి. ఇక ఓసీలో 18 కులాలు ఉన్నాయి. అయితే ఓసీ కేటగిరీలో బుద్ధిస్టులను, జైన్లలను కూడా చేర్చారు. అలాగే మతపరమైన కేటగిరిలో కూడా బుద్ధిస్టు, జైన్లకు వేరువేరు కోడ్‌లను ఇచ్చారు. అలాగే ఎస్సీ కేటగిరీ నుంచి క్రైస్తవులుగా మారిపోయిన వాళ్లని బీసీ 'సీ' లుగా వర్గీకరించారు. నిరాశ్రయుల వారసులు, అనాథలను బీసీ ఏ కేటగిరీ కిందకు చేర్చారు.

## బాలికపై బావ లైంగికదాడి

మొదటి పేజీ తరువాయి

దీపావళి పండుగ నాడు చిత్రీయాల గ్రామానికి చెందిన బాలిక మిస్సింగ్ పై చందంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు అందింది. బాధితుల ఫిర్యాదు మేరకు చందంపేట ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి విచారణ చేయగా.. నిందితుడు లైంగికదాడికి పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో నిందితుడిని రిమాండ్ కు తరలించారు. నిందితుడికి పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక


# బీసీ డిక్లరేషన్ హామీ ఏమైంది?



- కులగణనను స్వాగతిస్తున్నాం..
- ప్రశ్నల సంఖ్యను తగ్గించండి
- కాంగ్రెస్ఎమ్మెల్యేలను నిలదీయండి
- బీసీలకు 42శాతం రిజర్వేషన్ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించండి
- హనుమకొండలో కేటీఆర్ హాట్ కామెంట్స్

**హనుమకొండ, నవంబర్ 10:** కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులను బలిపశువులను చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఆదివారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది సరిగ్గా ఇదే రోజు కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఏడాది పూర్తయిందని, బీసీ డిక్లరేషన్ హామీలు ఏమైంది? ఒక్కటైనా హామీ అమలు చేసిందా? ఈ కాంగ్రెస్ ప్రభుత్వం? అని ఆయన ప్రశ్నించారు. చేతి గుర్తుకు ఓటు వేస్తే, చేతి వృత్తుల వాళ్లకు గొంతు కోసిన పాలన ఇదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తుందని, రేవంత్ రెడ్డి రాగానే బీసీ బంద్ అయింది, రైతుబంధు బంద్ అయిందన్నారు. బీసీల ఓట్ల కోసం ఇప్పుడు కులగణన అని కొత్త నినాదం ఎత్తుకున్నారని, సర్వే కోసం ఇంటికి వెళ్తే అధికారులను జనం నిలదీస్తున్నారన్నారు. 'బీసీలకు సబ్ ప్లాన్ అని చెప్పావ్? ఒకటన్న అమలు అయ్యాయా? కులగణనను మేము స్వాగతిస్తున్నాం.. కానీ, ఆ ప్రశ్నల సంఖ్యను తగ్గించండి. కేవలం కులాలకు సంబంధించిన సమాచారం మాత్రమే తీసుకోండి. ఆర్థిక అంశాలను ఆ ఫార్ములా నుంచి తొలగించండి. కులగణన చేసి బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేశాకే, స్థానిక ఎన్నికలు నిర్వహించండి' అని సూచించారు. తమ ఎమ్మెల్యేల మీద దాడులు చేయడం కాదు.. ఇచ్చిన మాటను మీద నిలబెట్టుకోవాలని సూచించారు. ఇదే వరంగల్లో రైతుల డిక్లరేషన్ ప్రకటించారన్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు మహారాష్ట్రలో సీఎం ప్రకటించారని, ఇక్కడి రైతులకు ఎక్కడ బోనస్ఇచ్చారో చూస్తారా? అని ప్రశ్నించారు. దీని కోసం ఏ మార్కెట్కు వెళ్దామో చెప్పాలని సూచించారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు సీఎంను నిలదీస్తూనే ఉంటామని, వెంటాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. కేసులు పెట్టుకున్నా.. పాసులు పెట్టుకున్నా భయపడేది లేదన్నారు. కులగణనలో అధికారులను నిలదీయాలని, ఈ వివరాలు ఎందుకని ప్రశ్నించండని ప్రజలకు చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడగండని సూచించారు. సీఎం ఇచ్చిన హామీలు మీరు అమలు చేస్తారా? అని కుల గణనకు వస్తున్న అధికారులను రాసి ఇవ్వాలని అడగండని చెప్పారు. పదే పదే బాంబులు పేలుతాయని చెబుతన్న పొంగులేటికి 'బాంబుల శాఖ మంత్రి'గా పేరు పెట్టాలన్నారు. 'కాంగ్రెస్ ఏడాది వైఫల్యాల పైన మేము కూడా వారోత్సవాలు నిర్వహిస్తాం. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర వెళ్లి అబద్ధాలు మాట్లాడుతున్నాడు. ఎవని అయ్యా సొమ్ము అని అబద్ధాలతో ఫుల్ పేజీ యాడ్లు వేస్తున్నారు. సరిగ్గా సంవత్సరం కింద ఇదే రోజు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలకు అనేక హామీలు ఇచ్చింది. ఆడపిల్లల ఓట్ల కోసం బలహీన వర్గాల ఓట్ల కోసం దొంగ హామీలను ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క బీసీ డిక్లరేషన్ హామీ అయినా అమలు చేసిందా?' అని కేటీఆర్ ప్రశ్నించారు.

# గ్రూప్-3 హాల్టికెట్లు డౌన్లోడ్ చేసుకోండి

**హైదరాబాద్, నవంబర్10 :** రాష్ట్రంలో 1,365 గ్రూప్-3 సర్వీసుల పోస్టుల భర్తీకి ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న రాతపరీక్షల హాల్టికెట్లను టీజీపీఎస్సీ వెబ్సైట్లో పొందుపరిచింది. ఈ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 5.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పదిహేడో తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్-2 ఉంటుంది. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-3 పరీక్ష నిర్వహించనుంది. పరీక్ష సమయానికి అరగంట ముందు గేట్లు మూసివేస్తామని కమిషన్ ప్రకటించింది. డౌన్లోడ్ చేసుకున్న హాల్టికెట్ను మూడు పేపర్లకూ ఉపయోగించవచ్చని స్పష్టం చేసింది.



# జూబ్లీహిల్స్లోని హోటల్లో భారీ పేలుడు

## పలువురికి తీవ్ర గాయాలు
## రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ పేలడంతో ప్రమాదం
## పక్కనున్న బస్తీలోని ఆరు ఇండ్లు ధ్వంసం

**హైదరాబాద్, నవంబర్10:** హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 1 చెక్పోస్ట్ సమీపంలో భారీ పేలుడు సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున.. తెలంగాణ స్పైసీ కిచెన్ రెస్టారెంట్లో ఈ ఘటన జరిగింది. రెస్టారెంట్లోని రిఫ్రిజిరేట్ కంప్రెషర్ ఒక్కసారిగా పేలడంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో పెద్ద శబ్దంతో మంటలు భారీ ఎత్తున ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో హోటల్ ప్రహరీ గోడ కూలి పక్కనే ఉన్న బస్తీలోని ఇళ్లపై పడింది. దీంతో ఓ మహిళతో పాటుగా బాలిక తీవ్రంగా గాయపడింది. ఏసీ కంప్రెషర్ లేదా ఫ్రిజ్ కంప్రెషర్ పేలడంతో భారీ పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. భారీ పేలుడుతో రెస్టారెంట్ ప్రహరీ రాతి గోడ పూర్తిగా ధ్వంసం అయ్యింది. అయితే హోటల్ పక్కనే దుర్గా భవానీ బస్తీలో కొందరు పేదలు సిమెంట్ రేకులతో తాత్కాలికంగా నిర్మించిన షెడ్లలో నివాసం ఉంటున్నారు. ప్రహరీ గోడ రాళ్ల ఎగిరిపడి వారి బస్తీలోని ఇండ్లపై పడటంతో ఐదు ఇండ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఓ మహిళ, మరో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వారికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పాట్కు చేరుకొని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కంప్రెషర్ పేలుడు ద్వారానే ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. విచారణ తర్వాత పేలుడుకు గల కారణాలు తెలుస్తాయన్నారు. ఇదిలా ఉండగా.. గాఢ నిద్రలో ఉండగా.. ఒక్కసారిగా పేలుడు శబ్దం రావటంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. తాము గత 40 ఏళ్లుగా ఈ బస్తీలో ఉంటున్నామని బాధితులు వెల్లడించారు. చిన్నచిన్న పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకునే తాము పేలుడు ధాటికి సర్వం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వంసమయిన ఇళ్లను పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మరోవైపు ఇళ్లు నష్టపోయిన బాధితులు ఆవేదన చెందుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా, ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# కేసుల పెండింగ్ సంఖ్యను తగ్గించాలి

- గొప్ప చరిత్ర గల జిల్లా కరీంనగర్ • హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే



**కరీంనగర్, నవంబర్ 10:** కోర్టులో కేసుల పెండింగ్ సంఖ్యను తగ్గించాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక ఆరాధ్య అన్నారు. కరీంనగర్ కోర్టు ఆవరణలో పోస్కో, ఫ్యామిలీ కోర్టు సహా 12 కోర్టులు ఉండే జిల్లా కోర్టు సముదాయాల భవన నిర్మాణానికి, సీతారాంపూర్ రోడ్డులో న్యాయాధికారుల నివాస గృహాల భవనాల నిర్మాణాలకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రధాన న్యాయమూర్తి సహా ఇతర న్యాయమూర్తులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి బి.ప్రతిమ స్వాగతం పలికారు. పోలీసులు ప్రధాన్ న్యాయమూర్తికి గౌరవ వందనం సమర్పించారు. భవన నిర్మాణం స్థలంలో భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే మాట్లాడుతూ కరీంనగర్ కోర్టు భవనం 1956లో ప్రారంభించబడిందని తెలిపారు. హైకోర్టు భవనానికి ఉపయోగించబోయే స్టోన్ కరీంనగర్ జిల్లా నుండి రాబోతుందని తెలిపారు. కేసుల పెండింగ్ సంఖ్యను తగ్గించాలని అన్నారు. ఇందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని సూచించారు. కరీంనగర్ కోర్ట్ భవనం 18 నెలల్లో అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి కృషిచేసిన పూర్వపు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి నవీన్ రావుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ టి.వినోద్ కుమార్, జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి, జస్టిస్ ఎన్.వి శ్రవణ్ కుమార్, జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ జె.శ్రీనివాసరావు, హైకోర్టు పూర్వపు జడ్జి పి.నవీన్ రావు, కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జ్ టీఎస్ బి. ప్రతిమ, తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యులు లక్షన్ కుమార్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పీవీ రాజ్ కుమార్, కార్యదర్శి బేతి మహేందర్ పాల్గొన్నారు.



# హైదరాబాద్ వస్తున్నా..

**హైదరాబాద్, నవంబర్10 :** 'హైదరాబాద్ వస్తున్నా.. దమ్ముంటే ఆపండి అంటూ సీఎం రేవంత్ కు అఘోరీ సవాల్ విసిరింది. ఆరు గుళ్లపై దాడులు జరిగితే రేవంత్ నువ్వేం చేస్తున్నావ్. ఒక్కడిపైనా చర్యలు తీసుకోలేదు. మీకు శివతాండవం చూపిస్తా అంటూ సంచలన వీడియో రిలీజ్ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న అఘోరీ సంచలన వీడియో విడుదల చేసింది. విజయవాడ దుర్గమ్మ దర్శనం తర్వాత హైదరాబాద్ వస్తానని తెలిపింది. హైదరాబాద్ వస్తున్నా.. ఎలా ఆపుతారో చూస్తానని ప్రభుత్వానికి సవాల్ విసిరింది. ఇప్పటివరకూ హైదరాబాద్లో ఆరు గుళ్లపై దాడులు జరిగాయని తెలిపింది. అయినప్పటికీ ప్రభుత్వం, సీఎం రేవంత్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. తాను హైదరాబాద్ వచ్చాక శివతాండవం ఎలా ఉంటుందో చూపిస్తానంటూ వార్నింగ్ ఇచ్చింది. అయితే అఘోరీ హైదరాబాద్కు వచ్చి ఎలాంటి ఆందోళన చేస్తుందోనన్న చర్చ మొదలైంది.



### లోక కల్యాణం కోసమే ఈ పూజలు..

ఈ మేరకు అఘోరీ మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణకు గురువుల ఆదేశానుసారం దేశంలో పర్యటిస్తున్నానని చెప్పారు. మహిళలపైన, చిన్నారులపైన, హిందూ దేవాలయాలపైన దాడులు నివారించబడేందుకు, లోక కల్యాణం కోసం తాను కృషి చేస్తున్నానని అన్నారు. కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాలను సందర్శిస్తున్నానని తెలిపారు.

### దర్శనానికి అనుమతించేది లేదు..

ఆదివారం శ్రీశైలంలో ప్రత్యక్షమైంది. కార్తీక మాసంలో ప్రముఖ శైవ క్షేత్రాలను వరుసగా సందర్శిస్తున్న అఘోరీ శ్రీశైలం శ్రీ మల్లిఖార్జున స్వామిని దర్శించుకుంది. అఘోరీ దిగంబరంగా స్వామివారిని దర్శించుకునే ప్రయత్నం చేయగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు. వస్త్ర ధారణ లేకుండా దర్శనానికి అనుమతించేది లేదని ముఖద్వారం వద్ద అఘోరిని ఆలయ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు నిలిపేశారు. దాంతో ఆమె వస్త్రధారణ చేసుకుని స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుంది. సోమవారం తెలంగాణలోని పోచమ్మ ఆలయాన్ని సందర్శించుకుని అనంతరం అటు నుంచి అటే కుంభమేళాకు వెళ్తానని అఘోరీ నాగసాధు వెల్లడించారు.

# కులగణన అడ్డుకోవాలని పెత్తందారుల కుట్రలు ఎందుకు?

## బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు సంజయ్



**హుజూరాబాద్ :** రాష్ట్ర ప్రజలు ఎలాంటి అపోహాలు పెట్టుకోకుండా కుల గణన విజయవంతం చేయాలని బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం రోజు హుజూరాబాద్ లో బీసీ సంఘాల నాయకులు సందెల వెంకన్న, ఇప్పకాయల సాగర్, చల్లూరి రాజేందర్ లతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. కులగణన కోసం గత 93 సంవత్సరాలుగా పోరాటాలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న కుల గణన బీసీల ఉద్యమ విజయమని దీనిని అడ్డుకోవడానికి పెత్తందారులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ బీసీలు విద్యా ఉద్యోగ వ్యాపార రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని జనాభా ప్రతిపాదికన బీసీలకు రిజర్వేషన్లు కావాలని అనేక పోరాటాలు చేస్తున్నమని కానీ న్యాయస్థనాలు కులగణన లేకపోవడం వల్ల 50 శాతం సీలింగ్ కు మించి రిజర్వేషన్లు ఉండకూడదని ఆంక్షలు విధించిందని దేశంలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలు రిజర్వేషన్లు సీలింగ్ వల్ల నష్టపోతున్నారని, సీలింగ్ ఎత్తివేయాలంటే శాస్త్రీయ పద్ధతిలో కులగనన చేయాలని న్యాయస్థానాలు పేర్కొన్నాయని, శాస్త్రీయ పద్ధతిలో కులగణన కోసం బీసీ సంఘాలుగా తాము అనేక పోరాటాలు నిర్వహించామని, చివరకు ఆమరణ దీక్షతో చావు నోట్లో తలలు పెట్టి వీరోచితంగా పోరాడటం వల్ల ఈ కులగణన రాష్ట్రంలో సాధ్యమైతుందని, రేపటి భవిష్యత్తు తరాలను మార్చే ఈ ప్రక్రియలో ప్రజలు ఎలాంటి అపోహాలు పెట్టుకోకుండా పాల్గొని తమ వివరాలు ప్రభుత్వ యంత్రాంగానికి తెలియజేసి సమన్యాయం కోసం కృషి చేయాలని కోరారు. చారిత్రక కుల గణనను విఫలం చేయడానికి ప్రతిపక్ష బిజెపి పార్టీ, కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెత్తందారులు భూస్వాములు జమీందార్లు కుట్రలు చేస్తున్నారని వారి కుట్రలను తిప్పి కొడతామని చైతన్యవంతమైన ఈ సమాజం తప్పకుండా కులగణనను విజయవంతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వంతోనూ పోరాడి దేశవ్యాప్త కులగలను సాధిస్తామని అన్నారు.

# ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే కఠిన చర్యలు తప్పవు



**హుజూరాబాద్ :** శాంతి భద్రత పరిరక్షణ విషయంలో ప్రజలకు ఇబ్బంది కలిగించే వారి పైన కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ జి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. కరీంనగర్ జిల్లా కమిషనరేట్ పరిధిలో పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున శనివారం హుజూరాబాద్ పట్టణంలో జరిగిన ధర్నా మరియు రాస్తారోఖో వల్ల ఎంతో మంది సామాన్య జనం, ఆసుపత్రికి వెళ్లే వారికి, ఎమర్జెన్సీలో అంబులెన్సు లో వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తడం జరిగిందని అన్నారు. అటువంటి చర్యలపైన భారత కొత్త చట్టాల ప్రకారం చట్ట పరిధిలో కఠినమైన చర్యలు తీసుకుంటామని, అదే విధంగా ఎవరైనా ఎలాంటి అనుమతులు పర్మిషన్లు లేకుండా సభలు, సమావేశాలు, హైవేల మీద, ఇతర మార్గాల మీద అక్రమంగా గుమ్మిగుడి ధర్నాలు గాని రాస్తారోఖోలు చేయరాదని హెచ్చరించారు. ఎవరైనా ఎలాంటి పర్మిషన్స్ లేకుండా ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపైన చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని, నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరూ చేసినా ఎవరిని ఉపేక్షించబోమని ముందస్తుగా తెలిపారు.

## సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు

**కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటన లో తెలిపారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో ప్రజలు సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు, ప్రజలు దీనిని గమనించి కలెక్టరేట్ కార్యాలయానికి ఎవరూ రావద్దని కలెక్టర్ అట్టి ప్రకటన లో వెల్లడించారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్

# సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్రామ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం
- పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి

**వారధి న్యూస్, ఆత్మకూరు:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీ కురుమూర్తి స్థాన దేవస్థానం నందు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 110 కోట్లతో నిర్మించ తలపెట్టిన కారిడార్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత వారం క్రితం స్థానిక శాసనసభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం నేటి 110 కోట్లతో నిర్మించిన తలపెట్టిన రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన ఈ పుణ్యక్షేత్రానికి ఎంతో విశిష్టతగలదని దాదాపు 900 సంవత్సరాల క్రితం ఇలవేల్పుగా పూజింపబడుతున్న, ఈ ప్రదేశం చాలా గొప్పదని పేర్కొన్నారు. ఇక్కడ ఇంకా వసతుల కొరత ఉన్నట్లు స్థానిక శాసనసభ్యులు తెలియజేస్తున్నారు. వాటి అభివృద్ధి అంచనా వేసి నిధులు మంజూరుకు నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వలసలకు మారుపేరుగా ఉన్న పాలమూరు జిల్లాలో కిలోమీటర్ల కొద్ది కృష్ణమ్మ ప్రవహిస్తున్న గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వలన, అట్టి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వలన ఇప్పటికీ వలస వెళ్లడం దురదృష్టకరమని అన్నారు. ఆనాడు 2009లో కే చంద్రశేఖర రావు పార్లమెంటు సభ్యులుగా ఈ జిల్లా నుంచి ఎన్నిక కాబడ్డారని, అప్పట్లో ఈ ప్రాంత ప్రజలు ఆయనను ఆశీర్వదించారని గుర్తు చేశారు. వారి పాలనలో తెలంగాణకు పరిశ్రమలు రాలేదని ఆయన పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలుగా పండిత జవహార్ లాల్ నెహ్రూ పేర్కొన్నారని. అదేవిధంగా ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న నెట్టెంపాడు, పాలమూరు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేస్తామని అన్నారు. మక్తల్, నారాయణపేట, కృష్ణ సాగునీటి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ఆ ప్రాంతంలో కృష్ణ నీరు పారించేందుకుగాను అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీటి అందించి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. కొందరు అభివృద్ధిని అడ్డుకోవడానికి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని వారికి నా జిల్లా ప్రజలు క్షమించరని, అభివృద్ధిని అడ్డుకోవద్దని నిధుల కేటాయింపులు అడ్డుకోద్దని అయిన కోరారు. ఒకవేళ అడ్డుకుంటే జిల్లా చరిత్ర హీనులుగా మిగిలిపోతారని దీనిని ఎవరు కూడా క్షమించరని అన్నారు. ఈ జిల్లా వాసిగా ఇక్కడ విద్యాభివృద్ధి కోసం పాలమూరు యూనివర్సిటీలో లా విద్యను అనుమతి ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పరిశ్రమల కోసం చర్చలు



కొనసాగుతున్నాయని, వేలాదిమంది పాలమూరు జిల్లా నుండి 2000 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వారు అమరరాజా కంపెనీ వారి నుంచి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏ పరిశ్రమ వచ్చిన పరిశ్రమలలో నిరుద్యోగులకు నైపుణ్యత నిచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ప్రతి గ్రామాలలో, తండాలలో ఏ చిన్న గ్రామంలో బీటి రోడ్డు లేదని వినదల్చుకోలేదని కావున ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేసే బాధ్యత తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రతినెల విద్య ,వైద్యం, ఉపాధి పై జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర్ రాజ నరసింహతో నెలవారి సమీక్ష చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ, దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి, మక్తల్ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు సీతా దయాకర్, మైనార్టీ కార్పొరేషన్ అధిపతి ఒబేదుల కోత్వాల్, మహబూబ్‌గర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, జిల్లా ఎస్పీ జానకి, సంస్థానాదేశులు అధ్యక్షులు శ్రీరాం భూపాల్, ఆలయ చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, భక్తులు ,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఆదివారం నాడు గెజిటెడ్ హెడ్మాస్టర్స్ నూతన కార్యవర్గ సభ్యులు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే నీ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు . ఏ సమస్యలున్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. టి పిసిసి ప్రదాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్ తో పాటు, అధ్యక్షులు అనంతప్ప, ప్రధాన కార్యదర్శి జగదీష్ కుమార్ ,ట్రెజరర్ అబ్దుల్ హక్, రామకృష్ణ, గోపాల్, రామలింగం, రామచంద్ర, వెంకట్ రాములు, రాజేశ్వర్ , యాదయ్య తదితరులు ఉన్నారు.

## విదేశీ పర్యటన ముగించుకొని తిరిగి వచ్చిన ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఘన స్వాగతం



**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో :** వారం రోజులపాటు లండన్ పర్యటనకు వెళ్లి తిరిగి వచ్చిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు కార్యకర్తలు, నాయకులు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లో ఘనంగా స్వాగతం పలికారు.గత కొద్ది రోజుల క్రితం విదేశీ పర్యటన లండన్ టూరిజం కార్యక్రమం కోసం వెళ్లి కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని తిరిగి హైదరాబాద్ చేరుకున్నరు. మర్యాదపూర్వకంగా కలిసి పూల బుక్కేతో స్వాగతం పలుకుతున్న లింగాల మండల పార్టీ నాయకులునేషనల్ ట్రైబల్ రాష్ట్ర ఉ పాధ్యక్షులు ఉల్లంగొండ్ల రాజు, చెంచిటి శివ కుమార్, మూడవత్ వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

## బీసీల చైతన్యం కోసం త్వరలో పాదయాత్ర

- బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**వారధి న్యూస్, వనపర్తి :** బీసీల చైతన్యం కోసం త్వరలో పాదయాత్ర చేపట్టనున్నట్లు బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ తెలిపారు. ఆదివారం వనపర్తి పట్టణంలో జరిగిన బిసి పొలిటికల్ జెఎసి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సమస్యలపై దృష్టి సారించి, సమగ్ర కుల గణన చేపట్టడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు కృషి చేస్తున్నారని, కానీ ఉమ్మడి పాలమూరు జిల్లాలో మాత్రం బీసీలను విస్మరిస్తున్నారని రాచాల ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు వ్యతిరేకంగా వివక్ష కొనసాగుతోందని, రాజకీయ, ఆర్థికంగా అణగదొక్కాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. త్వరలో పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించి, అన్ని వర్గాల నుంచి సూచనలు తీసుకుని రూట్ మ్యాప్‌ను ఖరారు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, రాఘవేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కోళ్ల వెంకటేష్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎబిజె సత్యం సాగర్, ఎరుకల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బలరాం, సూగురు మాజీ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్, యాపర్ల మాజీ ఎంపీటీసీ, విక్రమ్ గౌడ్, వై-శాఖపూర్ మాజీ సర్పంచ్ రవి కుమార్ యాదవ్, వాల్మీకి సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ నాయుడు, యాదవ సంఘం జిల్లా నాయకులు పరుశురాం యాదవ్ గౌడ సంఘం నాయకులు రవీందర్ గౌడ్, సూగురు శ్రీనివాస్ గౌడ్, మేఘనాథ్ గౌడ్ ,మత్స్య సంఘం జిల్లా నాయకులు గువ్వల చెన్నయ్య, శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్‌లను సన్మానించిన సిపిఎం ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ అనురాధ

వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో: అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కేటాయించింది నామినేటెడ్ పదవులను పొందిన వివిధ శాఖల చైర్మన్ లను సిబిఎం ట్రస్ట్ చైర్పర్సన్ ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు సన్మానం పొందిన వారిలోజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత, అచ్చంపేట పాల శీతలీకరణ కేంద్రం విజయ డైరీ చైర్మన్ నర్సయ్య యాదవ్‌లను శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## విజయవంతంగా కొనసాగిన ఉచిత భోజనం కార్యక్రమం

వారధి న్యూస్ మహబూబ్ నగర్ : నవాబుపేట మండల కేంద్రానికి సంత కొరకు (అంగడి )చుట్టుముట్టు గ్రామాల నుండి వచ్చే ప్రజల కొరకు %జీఖ% ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత భోజనం పదవ వారం విజయవంతంగా ముగిసింది కార్యక్రమంలో జెకె ట్రస్ట్ చైర్మన్ మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు మాజీ మండల ఏఎంసీ చైర్మన్ వి నరసింహ చారి తో పాటు ట్రస్ట్ డైరెక్టర్ సుధాకర్ చారి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టంకర నిరంజన్, యువ నాయకులు తీగలపల్లి ఆశన్న , ఆఫీసు ఇంచార్జ్ నాగలింగం, దేవరకొండ రఘు, జోగు చందు పాల్గొన్నారు.

## ఆదివాసీ ఎరుకలను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఆదివాసి ఎరుకల రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు




**వారధి న్యూస్, పెబ్బేరు:** తెలంగాణలో ఎరుకల నో ఆదుకోవాలని సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు ఆదివారం పెబ్బేర్ లో తెలంగాణ పందల పెంపకం మరియు వ్యాపారస్తుల సంఘం సమావేశంలో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి పందులను ఎగుమ చేయకుండా సమ్మె చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ సమ్మెకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వము దృష్టికి తీసుకెళ్లి పందులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు అండగా ఉంటామని తెలియజేశారు. పందుల పెంపకాన్ని పందుల వ్యాపారాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రంలో పందులపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసి ఎరుకల కుటుంబాల అభివృద్ధి కోసం పందుల పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ కన్వీనర్ గా మంగరాయి వెంకటేష్ ములుగుమాను బాల కొండన్న నల్లగొండ పోచన్న మక్తల్ మొలప్ప కోస్గి కిష్టప్ప అలంపూర్ విశ్వనాథం లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు మానుపాటి ఎల్లయ్య నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు కూరాకుల శ్రీనివాస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు పాతపల్లి నరసింహ గద్వాల జిల్లా అధ్యక్షులు గుజ్జుల వీరస్వామి మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు వెంకటయ్య బూత్కూరు మండల అధ్యక్షులు కురుమయ్య అలంపూర్ రాజు పెబ్బేరు చిన్న రాముడు వనపర్తి మానుపాడు వెంకటయ్య
ధన్వాడ జంసేడు వెంకటయ్య కొత్తకోట ప్రవీణ్ చిట్యాల శేఖర్ రాజోలి మాదా శివ తదితరులు పాల్గొన్నారు.

## నీటి కొరతతో రోడ్డెక్కిన వెలిజర్ల గ్రామస్తులు

- నీటి సరఫరా సజావుగా అందేలా చర్యలు చేపట్టాలి.



**వారధి న్యూస్, షాద్ నగర్ :** గత నాలుగు రోజుల నుండి తమకు తీవ్ర నీటి కొరత ఏర్పడిందని ఫరూఖ్ నగర్ మండలం వెలి జర్ల గ్రామ-స్తులు రోడ్డెక్కారు. రోడ్డుకు అడ్డుగా ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళనకు దిగారు. గ్రామంలోని మొదటి వార్డుకు నిత్యం నీటి కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి నీటి కొరత నుండి విముక్తి కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులను వివరణ కోరగా.... ప్రస్తుతం వాటర్ ట్యాంక్ లో నీరు ఉందని, మొదటి వార్డులో పైప్లైన్ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. గ్రామ పాలకవర్గ అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. గ్రామ సెక్రెటరీ సకాలంలో
స్పందించకపోవడం తోనే ఈ సమస్య ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.




## ఉచిత కంటి వైద్య శిబిరం

- ఏర్పాటు చేయడం హర్షనియం
- సిబిఎం ట్రస్ట్ చైర్ పర్సన్ డా.అనురాధ

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** అచ్చంపేట మారుమూల ప్రాంతంలో నల్లమల్ల ప్రాంత వాసి అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జలంధర్ రెడ్డి పేదల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సిబిఎం ట్రస్ట్ చైర్పర్సన్ డాక్టర్ అనురాధ అన్నారు. అచ్చంపేట పట్టణంలో ఎమ్మెల్యే కాంప్ ఆఫీస్ లో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో అనుష ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయం చెన్నై వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరంఅచ్చంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ డాక్టర్ అనురాధ సూచన మేరకు ఏర్పాటు చేయడం జరిగింది. గత వారం రోజుల నుండి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం కు 890 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో సర్జరీ అవసరం ఉన్నవారికి 130 మందికి ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని నిర్వహకులు తెలిపారు. అత్యధిక మొబైల్ ఆపరేషన్ థియేటర్ ను వినియోగిస్తూ ఆపరేషన్ మరియు టెస్టులను ఉచితంగా నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేయడం జరిగిందని సమాజసేవ దాతృత్వం ద్వారా ఎంతోమంది నిరుపేద ప్రజలకు మద్దతు కుటుంబాలకు ఎటువంటి ఉచిత వైద్య శిబిరాల్లో ఎంతగానో ఉపయోగపడతాయని నున్నారు. అచ్చంపేట నియోజకవర్గం ప్రజలకు ఒక వైద్యుడిగా నాయకుడిగా ఉంటూ నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ కు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ సిబ్బంది, కార్యక్రమం నిర్వాహకులు రేణయ్య, రాజేష్, సైదులు , తదితరులు పాల్గొన్నారు.



## కులగణన సర్వేలో బీసీలు భాగస్వామ్యం కావాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళి కృష్ణ.
- ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరరావు.

**వారధి న్యూస్ ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కులగన్నన సర్వేకు బీసీలు భాగస్వామ్యం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళి కృష్ణ కోరారు. ములుగు జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యసభ మాజీ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య గారు గత 50 సంవత్సరాలు చేసిన పోరాట ఫలితంగానే నేడు కులగనన సర్వే చేపట్టడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గత ఎన్నికల సందర్భంగా వరంగల్ లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగనన సర్వేను చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 6 వ తారీకు నుంచి కులగనన సర్వేకు ప్రతి గ్రామంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘ మండల అధ్యక్షులు మరియు సంఘ ముఖ్యులు అందరూ ప్రతి గ్రామంలో జరిగే కుల గణన సర్వేకు సహకరించి కులాల వారిగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అన్ని వివరాలు నమోదు చేసినట్లయితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు ప్రభుత్వం పెంచే అవకాశం ఉందని అలాగే అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం అని అన్నారు. కొంతమంది కుల గణన సర్వేకు వివరాలు చెపితే పింఛన్లు, రేషన్ కార్డులు తీసివేస్తారని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి పుకార్లు నమోవొద్దని సర్వేకు వచ్చే అధికారులకు పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు, ఈకార్యక్రమంలో ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరరావు. ములుగు జిల్లా యూత్ అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్. నియోజకవర్గ ఇన్చార్జ్ బక్కి నవీన్. మల్లంపల్లి యువత అధ్యక్షులు వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఐలాపూరంలో కులగణన సర్వే బహిష్కరణ

- ఐలాపూరం షెడ్యూల్డ్ తెగ గ్రామపంచాయితీకి తారు రోడ్డు నిర్మించాలి.
- ఐలాపురం గ్రామస్థులు



**వారధి న్యూస్, ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపురం గ్రామంలో ఆదివారం రోజు గ్రామ పెద్ద మనుషుల ఆధ్వర్యంలో జనగణ కుటుంబ సర్వేని బహిష్కరించారు. ఈ సందర్భంగా ఐలాపురం మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం 75సంవత్సరాలు గడుస్తున్నా మా గ్రామానికి ఎలాంటి తారు రోడ్డు నిర్మించకపోవటం, గతంలో పాలించిన ప్రభుత్వాలకు ఇప్పుడు పాలిస్తున్నా ప్రభుత్వాలకు సిగ్గుచేటు మరియు గిరివికాస పథకం ద్వారా బోర్లు వేసి 7సంవత్సరాలు గడుస్తున్నా ఆ బోర్లాకు మూడు తీగల కరెంట్ కరువైంది. కాబట్టి గ్రామానికి సరైన మౌలిక సౌకర్యాలు కలిపించే వరకు ఈ కులగణన జనాభ సర్వేని జరగనివ్వమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కోడె సుధాకర్, చంద్రయ్య, మల్లేష్, బాలయ్యా, వెంకటయ్యా, పగిడయ్య, పేరెంటాలు సరస్వాతి, పార్వతి, పాపక్కా, సమ్మక్కా, సావిత్రి, యూత్ నాగేష్ లక్ష్మినారాయణ, సధానందం, ఆదినారాయణ, ప్రభాకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారంలో కూలిన ఇల్లు

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు.



**వారధి న్యూస్ ములుగు ప్రతినిధి : ములుగు నవంబరు10 :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ప్రమాదశావత్తు ఇల్లు కూలిపోయింది ఆదివారం రోజున పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి వర్యులు ధనసరి అనసూయ సీతక్క సూచన మేరకు ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన వావిలాల రవి ఇల్లు ప్రమాదవశాత్తు కూలిన విషయం తెలుసుకొని మండల కాంగ్రెస్ నాయకులు వెళ్లి ఎలా జరిగిందో తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రానున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ ఉపాధ్యక్షులు మామిడి రాంబాబు, వావిలాల పెద్ద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ లను సన్మానించిన సిపిఎం ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ అనురాధ



**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో :** అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కేటాయించింది నామినేటెడ్ పదవులను పొందిన వివిధ శాఖల చైర్మన్ లను సిబిఎం ట్రస్ట్ చైర్పర్సన్ ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు సన్మానం పొందిన వారిలోజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత, అచ్చంపేట పాల శీతలీకరణ కేంద్రం విజయ డైరీ చైర్మన్ నర్సయ్య యాదవ్ లను శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## శరవేగంగా ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటి వరకు 18 వేల700 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతులకు 48 గంటల్లోపు బిల్లుల చెల్లింపులు
- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



**వారధి న్యూస్, మెదక్ బ్యూరో :** జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ శరవేగంగా జరుగుతోందని కలెక్టర్ రాహుల్. రాజ్ తెలిపారు.

ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 18వేల 700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేశామని వెల్లడించారు. ఇప్పటివరకు ఎంత పరిమాణంలో ధాన్యం సేకరణ జరిగింది, ఎన్ని టాబ్ ఎంట్రీలు పూ-ర్తయ్యాయి, గన్నీ బస్తాలు, లారీల కొరత ఏమైనా ఉందా అని కేంద్రాల నిర్వాహకులను ప్రశ్నించగా, ఎలాంటి సమస్యలు లేవని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, ప్రతి రోజు ఒక్కో కేంద్రం నుండి కనీసం నాలుగు నుండి ఐదు లారీల లోడ్ ల చొప్పున ధాన్యం నిల్వలు రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ సూచించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట లారీలలో లోడ్ చేయించి రైస్ మిల్లులకు పంపించాలన్నారు. అకాల వర్షాలు వంటివి లేకుండా వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలంగా ఉన్నందున ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణకు సంబంధించి గన్నీ బ్యాగులు, లారీల కొరత వంటి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. , జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్ లో సన్నరకం, దొడ్డురకం వరి ధాన్యం సేకరణకై వేర్వేరుగా మొత్తం 490 వరకు కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచామని కలెక్టర్ వివరించారు. ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదు-పాయాలను కలిపిస్తూ, పకడ్బందీ పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు. నిబంధనలకు అనుగుణంగా 48 గంటల్లోపు రైతులకు బిల్లుల చెల్లింపులు జరిగేలా వెంటదివెంట ఓపీఎంఎస్ లో డాటా ఎంట్రీ చేయిస్తున్నామని తెలిపారు. రైతులకు సన్న ధాన్యానికి సంబంధించి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 2320 ముందుగా చెల్లించడం జరుగుతుందని, అనంతరం రూ. 500 బోనస్ ను కూడా ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ సంబంధిత ఫ్యాక్స్ కొనుగోలు కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక సమస్యల సాధనకై సమరశీల పోరాటాలకు సిద్ధం కండి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

**వారిది న్యూస్, ఆత్మకూరు :** ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు సమస్యల సాధనకై దశలవారీ సమ-రశీల పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ మాసోత్సవాలలో భాగంగా ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికుల సమస్యలపై మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో కార్మిక సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ:- కనీస వేతన చట్టాలు ఉన్నా పారదర్శకత లేని విధానాలు, అలసత్వ పర్యవేక్షణలతో చట్టాలు దోపిడి వర్గాలకు చుట్టాలుగా మారి నీరుగారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సర్వేలో కార్మికుల అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జివో 60 ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని, పిఎఫ్ కార్మికుల వాటిలోనే యాజమాన్యం వాట కూడా చెల్లించినట్లు చూపిస్తున్నారని అన్నారు. ఏజెన్సీ నిర్వహణ తీసుకొని రెండు సంవత్సరాల గడుస్తున్న నేటికీ ఈఎస్ఐ కార్డులు కూడ ఇవ్వలేదని దీనితో ఈఎస్ఐ స్కీం కింద కార్మికుల అందవలసిన ఆరోగ్య భీమతో పాటు ఇతర సదుపాయాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలకు ఒకసారి కార్మికులకు యూనిఫామ్స్, భద్రత సామాగ్రి అందజేయాల్సి ఉన్న అందజేయడం లేదని చిరిగిన యూనిఫామ్ బట్టలతో కార్మికులు అగౌరవ పాలవుతున్నారని అన్నారు. ఆత్మకూర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర శానిటరీ వెంకటయ్య ఏజెన్సీ నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా పెండింగ్ లో ఉంచుతున్నారని ఇప్పటికే కార్మికులకు నాలుగు నెలల జీతాలు చెల్లించలేదని అన్నారు. మూడు నెలల వేతనాలు చెల్లించకుండానే ఏజెన్సీ కాంట్రాక్టర్ చెల్లించినట్లు దబాయిస్తూ కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొట్టే కుట్రలు చేస్తున్నారని దీనిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపే కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు బ్రాంచ్ ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ నేతలు,




కార్మికులు ఎండి సత్తార్ బాలకృష్ణ అరుణ్, బాలకిష్టమ్మ, పార్వతమ్మ చెన్నమ్మ, బాలకిష్టమ్మ, బాలరాజ్, శ్రీకాంత్, మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగాలలో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యండి కుతూబ్

**వారిధి న్యూస్, ఆత్మకూరు :** రైల్వే ఉద్యోగాల భర్తీలో కేంద్ర ప్రభుత్వం చాలా ఏండ్ల నుంచి తెలుగు రాష్ట్రాల యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని, రైల్వే ఉద్యోగాలలో తెలంగాణకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తామని అఖిల భారత యు-వజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) జిల్లా కార్యదర్శి యం.డి.కుతూబ్ అన్నారు. ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) అమరచింత మున్సిపల్ పరిధిలోని రెండో మూడో వార్డుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యం.డి.కుతూబ్ మాట్లాడుతూ.. దేశంలో అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి ఉద్యోగాల భర్తీకే 13 ప్రాంతీయ భాషల్లో రాత పరీక్షలు నిర్వహిస్తుంటే.. రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ఆర్బీ) ల ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు మాత్రం కేవలం ఇంగ్లిష్, హిందీ భాషల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నారని, దీంతో ఆ ఉద్యోగాలన్నీ ఉత్తరాదివారికే లభిస్తున్నాయని ఆరోపించారు. రైల్వే ఉద్యోగాల్లో స్థిరపడాలన్న తెలుగు యువత ఆశలు నెరవేరడం లేదని వాపోయారు. దీనిపై ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్ర ప్రభుత్వంగానీ, రైల్వే శాఖ మంత్రి గానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్ల పరిధి లోని ఆర్ఆర్బీ ల ఆధ్వర్యంలో 5,696 అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. డిప్లొమా, ఇంజినీరింగ్ లాంటి టెక్నికల్ విద్యలు నేర్చుకున్న నిరుద్యోగ యువతను ఈ పోస్టుల్లో భర్తీ చేయనున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొన్నారన్నారు. వీటిలో దాదాపు 750 పోస్టులు సికింద్రాబాద్ ఆర్ఆర్బీ పరిధిలో భర్తీ చేయనున్నారన్నారు. మెరిట్ తో పాటు కంప్యూటర్ బేస్డ్ టెస్టులు, ఇంటర్వ్యూల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నప్పటికీ అసలైన రాత పరీక్షలను మాత్రం హిందీ, ఇంగ్లిష్ లోనే నిర్వహిస్తున్నారన్నారు. అంటే హిందీ, ఇంగ్లిష్ భాషలు నేర్చుకున్న వారికే




ఆర్ఆర్బీ ప్రాధాన్యమిస్తున్నదని విమర్శించారు. దేశంలోని ఎన్నో మాతృ భాషలు ఉన్నప్పటికీ తప్పనిసరిగా హిందీ, ఇంగ్లిష్ భాషలను నేర్చుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నదని, తద్వారా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ, ఏపీ యువతకు రైల్వే ఉద్యోగాలు ఎన్నటికీ లభించవని కేంద్ర ప్రభుత్వం చెప్పకనే చెప్తున్నదని వారు విమర్శించారు. త్వరలో జరగనున్న అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన రాత పరీక్షలను తెలుగులో రాసేందుకు అనుమతించాలని వారు కేంద్ర ప్రభుత్వం మరియు ఆర్ ఆర్ బీ బోర్డ్ ను డిమాండ్ చేశారు. డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అయినా రైల్వే బోర్డు ఈ సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. అదే విధంగా ఈ అంశంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు

వెంటనే స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ కార్యకర్తలు రవి, రాము, ఉదయ్, కిరణ్ ,మైబూ, చంద్రయుడు, కార్తీక్ పాల్గొన్నారు.



# విధులు సమర్థవంతంగా నిర్వహిస్తాం

## మున్సిపల్ కమిషనర్ శశిధర్




**వారధి న్యూస్, ఆత్మకూర్ :**

**వారధి న్యూస్:** ప్రస్తుతం ఆత్మకూరు మున్సిపాలిటీలో ఎన్ని వార్డులు కలవు?

**కమిషనర్:** మున్సిపాలిటీ నందు పది వార్డులు కలవు.

**వారధి న్యూస్:** మున్సిపాలిటీకి నిధులు ఎలా సమకూరుతున్నాయి?

**కమిషనర్:** ఇండ్ల పర్మిషన్, ఇంటి పన్నులు, నల్ల పన్నులు వలన నిధులు సమకూరుతున్నాయి. వారధి న్యూస్: ప్రస్తుత ఇంటిటి సర్వే ఎలా కొనసాగుతున్నది? కమిషనర్: ప్రస్తుతం మున్సిపాలిటీ నందు 4,262 కుటుంబాలకు సర్వే కొనసాగుతున్నది.

**వారధి న్యూస్:** ప్రతిరోజు పారిశుద్ధ్య నిర్వహణ కొనసాగుతున్నదా?

**కమిషనర్:** ప్రతిరోజు ప్రధాన రోడ్లు శుభ్రం చేయడం జరుగుతుంది ,అదేవిధంగా ప్రతి మంగళ, శుక్రవారాలలో ఒక్కోవార్డులు పరిశుభ్రత ఆరోగ్యం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

**వారధి న్యూస్:** పట్టణంలో ప్రధాన రహదారులు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి, ఎప్పుడు పూర్తి చేస్తారు?

**కమిషనర్:** పిఎఫ్ ఐ డి సి నిధులు రావలసి ఉంది వచ్చిన వెంబడే పూర్తి చేస్తాం.

**వారధి న్యూస్:** పట్టణంలోని ప్రధాన రహదారులలోని బ్లడ్ లైట్లు ప్రారంభం కాలేదు, ఎప్పుడు ప్రారంభిస్తారు?

**కమిషనర్:** ఆరు లక్షల నిధులతో త్వరలో లైట్లు ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం.

**వారధి న్యూస్:** ప్రస్తుతం ఎలాంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి?

**కమిషనర్:** మున్సిపాలిటీలోని గార్డెన్ లో టి పార్కు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

**వారధి న్యూస్:** మున్సిపాలిటీలో పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నారా?

**కమిషనర్:** మున్సిపాలిటీలో రెగ్యులర్ అసిస్టెంట్ ఇంజనీర్ లేకపోవడం వలన పనులు ఆలస్యం అవుతున్నవి, అదే విధంగా ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నది.

**వారధి న్యూస్:** పట్టణ ప్రజలకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?

**కమిషనర్:** ప్రధానంగా సకాలంలో ఇంటి పన్నులు, నల్ల బిల్లులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించగలరు, అదేవిధంగా ప్లాస్టిక్ వాడకూడదని, హెూటల్లో మంచి ఆహారం ఇవ్వాలని, త్వరలోనే అన్ని హెూటలను తనిఖీ నిర్వహించడం జరుగుతుంది.



# 'అనకాపల్లి రైల్వే స్టేషన్'ను.. మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

## ఎంపీ సీఎం రమేశ్

**అనకాపల్లి:** 'వికసిత్ భారత్'కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామని ఎంపీ, రైల్వే స్టాండింగ్ బోర్డు ఛైర్మన్ సీఎం రమేశ్ తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను ఆయన కూటమి నేతలతో కలిసి పరిశీలించారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న పనులను పరిశీలించారు. వేగవంతంగా పనులు చేపట్టాలని గుత్తేదారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తామన్నారు. అనకాపల్లి రైల్వే స్టేషన్.. మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. 2014-19లో లక్ష్మీదేవిపేట పైవంతెన పనుల కోసం రూ.7.50 కోట్లు విడుదల చేస్తే.. వైకాపా హయాంలో జగన్ ఈ నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. నిలిచిపోయిన ఆ పనులను పూర్తి చేస్తామన్నారు.



# పరీక్షల పేరిట దోపిడి



**మెదక్ జిల్లాలో వివిధ పరీక్షల పేరుతో దోపిడీ చేస్తున్నారు. పలు ప్రైవేటు వైద్యశాల ల్యాబ్ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బాధితుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. ఆశించిన స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు లేకపోవడంతోనే జనం ప్రైవేట్ కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.**

### ప్రైవేటు ల్యాబ్‌ల ఇష్ట రాజ్యం
### సిటీ స్కాన్ కు భారీగా బాదుడు
### పట్టించుకోని జిల్లా వైద్యారోగ్య శాఖ

**వారధి న్యూస్, మెదక్ బ్యూరో :** మెదక్ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక పక్క మందులు కొరత మరొక రోగికి కావాల్సిన పరీక్ష పరికరాలు కొరత కారణంగా ప్రైవేట్ ల్యాబ్ లను బాధితులు ఆశ్రయిస్తున్నారు. నిర్ధారణ పరీక్షల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ పరీక్షలను ఉచితంగానే చేస్తున్నాయి. అయితే ఫలితాలు రావడం ఆలస్యం అవుతోంది. దీంతో ల్యాబ్ లు ఆసుపత్రులపై వైద్యారోగ్య శాఖ పర్యవేక్షణ కోరడంతో ప్రైవేటు దోపిడీ పెరిగిపోయింది. ల్యాబ్లో వసూళ్ల నిర్వాహకానికి చెక్ పడే పరిస్థితి కనిపించడం లేదు. దగ్గు, దమ్ము, జలుబు మినహా ఏ ఇతర వ్యాధులతో వచ్చిన రోగులకైనా సరే రక్త మూత్ర ఇతరత్రా పరీక్షలు చేయడం పరిపాటిగా మారింది. వీటికి కార్పొరేట్ ఆసుపత్రుల ధరలను వసూలు చేస్తున్నారు. ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో పెద్ద మొత్తం చెల్లించి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది. ఇలా ఒక్కో వైద్యుడు వద్దకు రోజుకు సుమారు 50 నుంచి 100 మంది రోగులు పరీక్షలు నిర్వహిస్తుంటారంటే వారి సంపదలను ఇట్టే అర్థం చేసుకోవచ్చు . ఆసుపత్రుల్లో ఎలాంటి సౌకర్యాలు లేనప్పటికీ బెడ్ చార్జి ఇతర చార్జీలంటూ పెద్ద మొత్తంలో ఫీజులు దండుకోవడం వల్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నిబంధనలు పాటించని ల్యాబ్ లు...

ప్రైవేటు ఆసుపత్రులకు అనుబంధంగా ల్యాబ్లు మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. అయితే సంబంధిత ల్యాబుల్లో అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్, పాథాలజిస్టును, మెడికల్ దుకాణాల్లో అర్హతగల ఫార్మసిస్టులు ఉండడం లేదు. పరీక్షలు చేస్తుండడం మెడికల్ దుకాణాల్లో మందులు ఇస్తుండటం వంటివి జరుగుతున్నాయి. మెడికల్ దుకాణాల్లో విచ్చలవిడిగా ఫీజులు డబ్బులు దండుకుంటున్నారు. తమకు అధిక ఆదాయాన్ని అందించే కొన్ని కంపెనీలకు చెందిన మందులను మాత్రమే ఆసుపత్రి అటాచ్ మెడికల్ లో విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వైద్యులు సైతం సంబంధిత కంపెనీలకు చెందిన మందులను మాత్రమే చీటీలపై రాస్తున్నారు. పరీక్షల్లో సైతం ఇష్టారీతిగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా డెంగ్యూ జ్వరం హేలీసా టెస్ట్ ద్వారానే నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. బాధితుల నుండి అధిక మొత్తంలో పరీక్షల నిమిత్తం వసూలు చేస్తున్నారు, ఇదే కాకుండా ఇతర పరీక్షలు కూడా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. కొన్ని డయాగ్నస్టిక్స్ సెంటర్లకు అనుమతి లేకపోయినా వైద్యశాఖ అధికారులు ముడుపులు రావడంతో చూసి చూడనట్టు వ్యవహారం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### డయాగ్నొస్టిక్ సెంటర్లది అదే దారి

డయాగ్నొస్టిక్ సెంటర్లలో రేడియాలజీ నిబంధనలను పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. రోగనిర్ధారణకు వైద్య పరీక్షలు అవసరమయ్యే దాన్ని ఆసరాగా తీసుకొని చాలా ఆసుపత్రుల్లో అవసరం ఉన్న లేకున్నా పలు రకాల రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు చేస్తూ డబ్బులు గుంజు తున్నారని విమర్శలు ఉన్నాయి. సొంత ల్యాబ్ డయాగ్నొస్టిక్ సెంటర్లు, మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకొని వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకుంటున్నారు. డాక్టర్ రాసే మందులు ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులో మాత్రమే లభిస్తున్నాయి. కొన్ని ఆస్పటల్ లో వివిధ కంపెనీలకు ఆర్డర్ చేసి కేవలం మందులు వారి వద్ద మాత్రమే లభ్యమయ్యేలా ఒప్పందం చేసుకొని ఎమ్మార్పీతో విక్రయిస్తూ జేబులు ఖాళీ చేస్తున్నారు. ఆర్.ఎం.పి, పిఎంపీలు కొందరు తామే మీ తక్కువ కాదన్నట్లుగా క్లీనిక్లలో ఎలాంటి అనుమతి లేకుండానే బెడ్స్ ఏర్పాటు చేసి వైద్య సేవలను చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడు తున్నారు. ఇలాంటి ఆస్పత్రులు వైద్యాన్ని వ్యాపారంగా మార్చి సొమ్ము చేసుకుంటున్న వైద్యారోగ్య శాఖ ప్రేక్షకపాత్ర వహిస్తుందని విమర్శలున్నాయి. ఆసుపత్రులపై సరైన నిగా ఉంచి తరచు తనిఖీలు నిర్వహిస్తే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. అనుమతులకు దరఖాస్తు చేసుకున్నారా అన్నదానికే ప్రాధాన్యమిచ్చి ప్రతి ఏటా అనుమతుల పునరుద్ధరణ కోసం డబ్బులు దండుకుంటూ ప్రైవేట్ ఆస్పత్రులకు క్లీన్ చీట్ ఇస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

# త్వరగా భోగాపురం విమానాశ్రయ నిర్మాణం

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



**భోగాపురం:** విజయనగరం జిల్లాలోని భోగాపురం విమానాశ్రయాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. విమానాశ్రయ సేవలు త్వరలోనే అందుబాటు లోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్ర మంత్రి ప్రతి నెలా నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే కాకుండా జాతీయ స్థాయి ప్రమాణాలతో పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దానికి అనుగుణంగా భవిష్యత్తులో కార్యక్రమాలు చేపడతామని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక పరిస్థితులు పెరిగాయని, టూరిజం పెరగిందని, చిన్న చిన్న వ్యాపారాలు వృద్ధి చెందాయని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని విమానాశ్రయాన్ని తొందరగా పూర్తి చేస్తే అన్ని విధాలుగా విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక






# పోరాడి ఓడిన భారత్

## స్వల్ప లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా..

**గెబేహా:** భారత్‌తో జరుగుతున్న నాలుగు టీ20ల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 3 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులకు పరిమితమైంది. హార్దిక్ పాండ్య (39: 45 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) రాణించాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చెమటోడ్చి నెగ్గింది. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో స్టబ్స్ (47లి) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి అద్భుతంగా చెలరేగాడు. 4 ఓవర్లలో కేవలం 17 పరుగులే ఇచ్చి 5 వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో రెండు జట్లు 1-1తో సమమయ్యాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా ప్రారంభంలోనే పీకల్లోతు కష్టాల్లోకి జారుకుంది. గత మ్యాచ్ హీరో సంజూ శాంసన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అభిషేక్ శర్మ (4), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (4) మరోమారు విఫలం కావడంతో భారత్ 15 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో తిలక్ వర్మ (20), అక్షర్ పటేల్ (27)లు జాగ్రత్తగా ఇన్నింగ్స్‌ను నిర్మించినా.. కీలక సమయంలో వీరిద్దరూ ఔటయ్యారు. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హార్దిక్ పాండ్య క్రీజులో నిలుదొక్కుకోవడంతో భారత్ ఆమాత్రం స్కోరైనా చేసింది. రింకు సింగ్ (9) మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. దీంతో భారత్ 124 పరుగులకే పరిమితం అయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్‌సెన్, కొయెట్జీ, సైమ్‌లేన్, మార్క్రమ్, పీటర్ తలో వికెట్ తీశారు.

# కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయాలనుంది

## నవీనుల్ హక్




భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ, అఫ్గానిస్థాన్ బౌలర్ నవీనుల్ హక్ మధ్య జరిగిన వాగ్వాదం ఐపీఎల్‌లో అత్యంత వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ముంబయితో జరిగిన మ్యాచ్‌లో విరాట్ తక్కువ స్కోరుకే ఔటైనప్పుడు నవీనుల్ హక్ 'మ్యాంగో' పోస్టు పెట్టాడు. అది కూడా విరాట్ అభిమానుల్లో ఆగ్రహం తెప్పించింది. అయితే, గత వన్డే ప్రపంచ కప్ సమయంలో వారిద్దరూ కలిసి మాట్లాడుకుంటున్న వీడియోలు వైరల్‌గా మారాయి. తమ మధ్య జరిగిన ఘటనకు అక్కడితో ఫుల్‌స్టాప్ పెట్టినట్లైంది. ఇప్పుడు మరోసారి నవీనుల్ హక్ వార్తల్లో నిలిచాడు. లఖ్‌నవూ రిటైన్ జాబితాలో అతడికి చోటు దక్కలేదు. దీంతో మెగా వేలంలో తన పేరును నమోదు చేసుకున్నాడు. ఒకవేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తీసుకుంటే.. వెళ్తావా? లేదా? అనే ప్రశ్నలు నవీనుల్ హక్‌కు ఎదురయ్యాయి. కోహ్లీతో బ్యాటింగ్ లేదా బౌలింగ్ చేయాలనుందా? అనే ప్రశ్నకూ సమాధానం ఇచ్చాడు. "నేను కోహ్లీకి బౌలింగ్ చేశా. ఇక అతడితో కలిసి బ్యాటింగ్ చేయడాన్ని ఎంచుకుంటా" అని వెల్లడించాడు. దీంతో కోహ్లీతో తనకెలాంటి సమస్యలు లేవని చెప్పకనే చెప్పాడు. మరి ఆర్సీబీ నవీనుల్ హక్‌ను వేలంలో తీసుకుంటుందో ? లేదో చూడాలి. నవంబర్ 24, 25 తేదీల్లో మెగా వేలం జరగనుంది. అఫ్గానిస్థాన్‌కు చెందిన 29 మంది ప్లేయర్లు మెగా వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ ఈవెంట్ క్యాన్సిల్



పాకిస్తాన్ వేదికగా వచ్చే ఏడాది జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్‌లో నేడు(సోమవారం) జరగాల్సిన కార్యక్రమాన్ని ఐసీసీ రద్దు చేసింది. టోర్నమెంట్ షెడ్యూల్ విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడం, ఇండియా పాకిస్తాన్ పర్యటనకు నో చెప్పడంతో 8 జట్లు పాల్గొనే టోర్నమెంట్ నిర్వహణలో సందిగ్ధం నెలకొంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చ్ 19 వరకు ఈ టోర్నీ జరగాల్సి ఉంది. నేడు(సోమవారం) జరగాల్సిన షెడ్యూల్ రిలీజ్, వంద రోజుల కౌంట్ డౌన్ ఈవెంట్ రద్దయింది. భారత్ పాకిస్తాన్ లో పర్యటనకు 'నో' చెప్పడంతో షెడ్యూల్ అంశమై పాకిస్తాన్, టోర్నీలో పాల్గొనే జట్లతో చర్చిస్తున్నట్లు ఐసీసీ వర్గాలు తెలిపాయి. 'షెడ్యూల్ ఇంకా కన్ఫార్మ్ కాలేదు. ఆతిథ్య జట్టు, టోర్నీలో పాల్గొనే దేశాలతో షెడ్యూల్ గురించి మాట్లాడుతున్నాం. చర్చలు ముగిసిన తర్వాత షెడ్యూల్ ఎప్పుడు అన్నది వెల్లడిస్తామని ఐసీసీ అధికారి తెలిపారు. లాహోర్‌లో దట్టమైన పొగమంచు, భారత్ పాక్ పర్యటనకు 'నో' చెప్పడం వంటి అంశాలతో ఈవెంట్ రద్దయినట్లు తెలుస్తోంది. పీసీబీ చైర్మన్ మోసిన్ నఖ్వీ మాట్లాడుతూ.. భారత్ ఈ అంశమై ఎలాంటి రాతపూర్వక లేఖ ఇవ్వలేదన్నాడు. హైబ్రిడ్ మోడల్ గురించి మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపాడు. తొలుత షెడ్యూల్ చేసిన ప్రకారం భారత్ బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 20న, న్యూజిలాండ్‌తో 23న, పాకిస్తాన్ మార్చి 1న తలపడాల్సి ఉంది. ఈ మూడు మ్యాచ్‌లకు లాహోర్‌ను వేదికగా ఎంచుకున్నారు.




# టీ20 క్రికెట్‌లో ఫిల్‌సాల్ట్ అద్భుత రికార్డు

ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ అద్భుత శతకంతో వెస్టిండీస్‌పై మెరిశాడు. 53 బంతుల్లోనే సెంచరీ సాధించి ఇంగ్లండ్‌ను గెలిపించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ కేవలం రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి 16.5 ఓవర్లలో విజయం సాధించింది. ఓపెనర్ విల్ జాక్స్ (17)తో కలిసి తొలి వికెట్‌కు ఫిల్ సాల్ట్ (103లి: 54 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) 73 పరుగులు జోడించాడు. అయితే, జాక్స్‌తోపాటు కెప్టెన్ జోస్ బట్లర్ (0) వెనువెంటనే ఔట్ చేయడం మినహా విండీస్‌కు మరే సంతోషం దక్కలేదు. జాకబ్ బెతెల్ (58లి)తో కలిసి మూడో వికెట్‌కు 107 పరుగులు జోడించిన సాల్ట్ ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టీ20 కెరీర్‌లో ఫిల్ సాల్ట్ మూడో సెంచరీ బాదాడు. అయితే, ఈ మూడు సెంచరీలూ వెస్టిండీస్‌పైనే చేయడం విశేషం. ఇలా పొట్టి ఫార్మాట్‌లో అన్ని సెంచరీలను ఒకే జట్టుపై సాధించిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 34 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లే ఆడిన సాల్ట్ మూడు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలు సాధించాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోరు 119 పరుగులు. వరుసగా రెండు మ్యాచుల్లోనూ సెంచరీలు సాధించిన బ్యాటర్ల జాబితాలోనూ ఉన్నాడు. విండీస్‌పై 2023 డిసెంబర్ 16, డిసెంబర్ 19న జరిగిన రెండు టీ20ల్లో సెంచరీలు చేశాడు. ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మాక్స్‌వెల్ (భారత్‌పై), విండీస్ బ్యాటర్ ఇవిన్ లూయిస్ (భారత్‌పై), యూఏఈ ప్లేయర్ మహ్మద్ వసీమ్ (ఐర్లాండ్‌పై), సెర్బియా ఆటగాడు లెస్లీ డన్బార్ (బల్గేరియాపై) ఒకే జట్టుపై రెండేసి శతకాలు సాధించారు.

## టెస్ట్ జట్టుకు కోచ్ మార్పు ప్రచారం

# నిజం కాకపోవచ్చు : ఆకాశ్ చోప్రా




ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు విఫలమైతే బీసీసీఐ జట్టుకు ఫార్మాట్లను బట్టి కోచ్‌లను నియమిస్తుందనే ప్రచారం జోరందుకొంది. దీనిపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా స్పందించాడు. అతడు తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ " బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత్ జట్టు విఫలమైతే కోచ్‌గా గౌతం గంభీర్ (%+ఖఝఎ +ఖఎఎ-ష్ట్రఱతీ%)ను మార్చేస్తారని ప్రచారం జరుగుతోంది. అది పూర్తిగా పుకారే అని నేను అనుకొంటున్నాను. ఫార్మాట్ల ఆధారంగా కోచ్‌లను నియమిస్తారని చెప్పడం తొందరపాటే అవుతుంది. తప్పుడు ఉద్దేశాలతోనే ఇలాంటి ప్రచారాలు చేపడతారు. గంభీర్ హెడ్‌కోచ్‌గా ఇప్పుడే బాధ్యతలు చేపట్టాడు. అలాంటప్పుడు ఆటగాళ్లు బాగా ఆడకపోతే కోచ్ తొలగించడం అనే జరగదు. అది పద్ధతి కాదు. గంభీర్ అడిగినవి మొత్తం బీసీసీఐ సమకూర్చింది. గతంలో అతడే జట్టుకు భారతీయ కోచ్‌లు ఉండాలని చెప్పాడు. కానీ, తాను మాత్రం రేయాన్, మోర్కెల్‌ను అడిగాడు. యాజమాన్యం అంగీకరించింది. శ్రీలంక సిరీస్‌కు సీనియర్లను అడిగాడు.. బీసీసీఐ ఓకే అంది. పిచ్‌ల తయారీలో కూడా స్వేచ్ఛను ఇచ్చింది. ఇంత జరిగాక గంభీర్ కచ్చితంగా ఫలితాలకు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది" అని పేర్కొన్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను భారత్ ఓడిపోయింది. దీంతో గౌతం గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. తాజా ఓ హిందీ పత్రిక బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత్ ఓటమి పాలైతే.. గంభీర్‌ను టెస్ట్ జట్టు కోచ్‌గా తొలగిస్తారని పేర్కొంది. ప్రస్తుత నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తారని పేర్కొంది. ప్రస్తుతం అతడు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న టీ20 జట్టుకు స్టాండ్ ఇన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




## పాయల్ పాప సైలెంట్ అయ్యిపోయిందేంటబ్బా..!

ఆర్‌ఎక్స్ 100 లో తన అందాలతో కవ్వించింది పాయల్. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది. ఇక ఈ అమ్మడు వంసగా లు చేస్తూ దూసుకుపోయింది. ఎన్టీఆర్: కథానాయకుడు లోనూ నటించింది. ఒకే ఒక్క తో ఓవర్ నైట్ లో స్టార్ అయిన భామ పాయల్ రాజ్ పుత్. ఆర్ ఎక్స్ 100 తో హీరోయిన్ గా పరిచయం అయ్యింది పాయల్ రాజ్ పుత్ . తొలి తోనే హిట్ అందుకుంది ఈ అమ్మడు. అంతే కాదు ఆర్‌ఎక్స్ 100 లో తన అందాలతో కవ్వించింది పాయల్. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది. ఇక ఈ అమ్మడు వరుసగా లు చేస్తూ దూసుకుపోయింది. ఎన్టీఆర్: కథానాయకుడు లోనూ నటించింది. లవ్, వెంకీ మామా, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, జిన్నా ఇలా వంసగా లు చేసింది. కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయింది ఈ ముద్దుగుమ్మ. లతో పాటు వెబ్ సిరీస్ ల్లోనూ నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. చివరిగా మంగళవారం తో హిట్ అందుకుంది ఈ ముద్దుగుమ్మ. కానీ స్టార్ హీరోయిన్ హెూదాను అందుకోలేకపోయింది. అంతే కాదు ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ అవకాశాలు కూడా అందుకోలేకపోతోంది. ప్రస్తుతం పాయల్ చేతిలో చెప్పుకోదగ్గ లు లేవు. దాంతో సోషల్ మీడియాతో అభిమానులను ఆకట్టుకుంటుంది ఈ వయ్యారి భామ. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ నెటిజన్స్ ను కవ్విస్తుంది ఈ కుర్రది.



## 'పుష్ప 2' నుంచి శ్రీలీల ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ స్టార్ దర్శకుడు సుకుమార్, ఐకానిక్ స్టార్ అల్లు అర్జున్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'పుష్ప ది రూల్'. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తుంది. రష్మిక మందాన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో స్పెషల్ సాంగ్ తప్ప మిగతా షూటింగ్ కంప్లీట్ చేసుకున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ స్పెషల్ సాంగ్ షూట్ కూడా అయిపోయినట్లు తెలుస్తుంది. టాలీవుడ్ నటి శ్రీలీలను ఈ సాంగ్ కోసం తీసుకున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇదే వార్త ఇప్పుడు నిజం అయ్యింది. పుష్ప 2లో స్పెషల్ సాంగ్ చేస్తుంది శ్రీలీల. తాజాగా ఈ మూవీలో శ్రీలీల స్పెషల్ సాంగ్ చేస్తున్నట్లు కొత్త పోస్టర్‌ను వదిలారు మేకర్స్. కిస్సిక్ అనే స్పెషల్ సాంగ్‌లో శ్రీలీల చేయబోతుండగా.. థియేటర్లు దద్దరిల్లిపోవడం గ్యారెంటీ అని తెలుస్తుంది.



ఒక్క తో ఓవర్ నైట్ స్టార్ గా ఎదిగింది తరువాత వరుస విజయాలతో హ్యాట్రిక్ పూర్తి చేసింది. కాకపోతే ఎంత వేగంగా ఎదిగిందో అంతే వేగంగా పడిపోయింది ఈ ముద్దగుమ్మ. ఉప్పెన మూవీ ఒక సంచలనం. కొత్త దర్శకుడు బుచ్చిబాబు సాన మెగా హీరో వైష్ణవ్ తేజ్ ని పరిచయం చేస్తూ ఉప్పెన తెరకెక్కించాడు. ఒక్క తో ఓవర్ నైట్ స్టార్ గా ఎదిగింది తరువాత వరుస విజయాలతో హ్యాట్రిక్ పూర్తి చేసింది. కాకపోతే ఎంత వేగంగా ఎదిగిందో అంతే వేగంగా పడిపోయింది ఈ ముద్దగుమ్మ. ఉప్పెన మూవీ ఒక సంచలనం. కొత్త దర్శకుడు బుచ్చిబాబు సాన మెగా హీరో వైష్ణవ్ తేజ్ ని పరిచయం చేస్తూ ఉప్పెన తెరకెక్కించాడు. యూత్‌ఫుల్ ఎమోషనల్ లవ్ డ్రామాగా తెరకెక్కిన ఉప్పెన బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. ఆ సక్సెస్ లో హీరోయిన్ కృతి శెట్టి పాత్ర ఎంతగానో ఉంది.

## స్టైలిష్ లుక్‌లో అదుర్స్ అనిపిస్తోన్న కృతి శెట్టి

కాలేజ్ గర్ల్ గా కృతి శెట్టి గ్లామర్ కుర్రాళ్లను కట్టి పడేసింది. అప్పట్లో యువత ఆమె మాయలో పడిపోయారు. చిన్న గా విడుదలైన ఉప్పెన పెద్ద విజయం సాధించింది. అప్పట్లో హ్యాట్రిక్ పూర్తి చేసి గోల్డెన్ లెగ్ ఇమేజ్ సొంతం చేసుకుంది. ఈ వరుస విజయాలు నేపథ్యంలో రెమ్యూనరేషన్ పెంచేసింది.అయినప్పటికీ మేకర్స్ ఆమెతో లు చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే బంగార్రాజు తర్వాత ఆమెకు హిట్ లేదు. వరుస చిత్రాలు డిజాస్టర్స్ అయ్యాయి. మలయాళ, తమిళ భాషల్లో ఒకటి రెండు ఆఫర్స్ ఉన్నాయి కానీ ఎలాగైనా తెలుగులో నిలదొక్కుకోవాలని అమ్మడు ప్లాన్. శ్రీలీల కూడా వరుస ప్లాప్స్ తో డీలా పడింది. ఈ క్రమంలో నిర్మాతలకు కృతి శెట్టి బంపర్ ఆఫర్ ఇచ్చిందట గతంలో రూ. 2 కోట్లు డిమాండ్ చేసిన కృతి శెట్టి కోటి, కోటిన్నర ఇచ్చినా ఓకే అంటుందట.



## కేతిక వయ్యారాల వల..

సోషల్ మీడియ పుణ్యమా అని సినీరంగంలోకి అడుగుపెట్టింది ఓ ముద్దుగుమ్మ. తొలి చిత్రంతోనే అందం, అభినయంతో కవ్వించింది. ఇప్పటివరకు ఈ ముద్దుగుమ్మ సరైన బ్రేక్ కూడా అందుకోలేదు. కానీ తెలుగు సినీరంగంలో మాత్రం వరుస ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. కేతిక శర్మ.. ఈ ముద్దుగుమ్మకు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఉంది. షార్ట్స్ ఫిల్మ్, రీల్స్ ద్వారా నెట్టింట ఫేమస్ అయిన ఈ బ్యూటీకి ల్లో ఆఫర్స్ వచ్చాయి. చేతినిండా లతో క్షణం తీరిక లేకుండా గడిపింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ సరసన రొమాంటిక్ తో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. 2021లో విడుదలైన ఈ మూవీకి మిక్స్డ్ టాక్ అందుకుంది. ఆ తర్వాత లక్ష్య, రంగ రంగ వైభవంగా, బ్రో చిత్రాలతో అలరించింది. ఈ అమ్మాడికి తెలుగులో వరుస ఆఫర్స్ వచ్చాయి.. కానీ ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం అందుకోలేదు. చివరిసారిగా బ్రో చిత్రంలో కనిపించిన ఈ ముద్దుగుమ్మ చేతిలో ఇప్పుడు ఒక్క కూడా లేనట్లు తెలుస్తోంది. అయితే నెట్టింట మాత్రం రచ్చ చేస్తోంది. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా లంగావోణిలో అచ్చం పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తూ అట్రాక్ట్ చేస్తుంది. ఓర చూపులతో కవ్విస్తూ కట్టిపడేస్తోంది ఈ ముదుగుమ్మ. ప్రస్తుతం ఈ బ్యూటీ ఫోటోస్ వైరల్ గా మారాయి.

